

# మా ఊరి "నందుల" ఆత్మీయ కథ



# <u>విషయ సూచిక</u>


| | | |
|---|---|---|
| 1) | మీరేం నేర్చుకున్నారు | .. |
| 2) | మా ఊరు | .. |
| 3) | నందులవారి వంశవృక్షం | .. |
| 4) | నందుల వారింట 'నందుల వైభవం' | .. |
| 5) | నందుల వారింట పాడి వైభవం | .. |
| 6) | పంటలు | .. |
| 7) | వృత్తులు | .. |
| 8) | పండుగలు | .. |
| 9) | ఆటలు | .. |
| 10) | పార్టీలు | .. |
| 11) | సాహిత్యం | .. |
| 12) | సంగీతం | .. |
| 13) | భజనమండలి | .. |
| 14) | నాటకాలు | .. |
| 15) | ప్రేమ వివాహం | .. |
| 16) | సహజీవనం | .. |

| | | |
|---|---|---|
| 17) | దయ్యాలు | .. |
| 18) | వైద్యులు – భూత వైద్యులు | .. |
| 19) | శాస్త్రవేత్త | .. |
| 20) | రైతులు | .. |
| 21) | అతిధులు | .. |
| 22) | రాజకీయ నాయకులు | .. |
| 23) | ఉపసంహరణ | .. |
| 24) | యోగిని సుబ్బమ్మ | .. |
| 25) | అవధూత కేశవ నారాయణ స్వామి | .. |
| 26) | విశ్రాంత పాఠశాల | .. |

# 2. మా ఊరు

మా స్వంత ఊరు కడప జిల్లా, బద్వేలు తాలూక, పలుగురాళ్ళపల్లె మజరా భాకరాపేట గ్రామం. ఆంధ్రదేశంలో భాకరాపేట లు అనేకం వున్నాయ్. ఇది ఒక చిన్న గ్రామం వీరబ్రహ్మేంద్ర స్వామి మఠానికి 5 మైళ్ళ దూరం. శిద్దయ్య గారి మఠానికి 3 మైళ్ళ దూరం, గోవిందస్వామి మఠానికి అరమైలు దూరంలో వుంటుంది.

తూర్పున కోడూరు కొండ, పడమర పలుగురాళ్ళ పల్లె మాగాణి, ఉత్తరాన భాకరా పేట మాగాణి, దక్షిణాన బొగ్గుల వారి పల్లె. నా బాల్యం, కౌమారం ఈ ఊర్లోనే గడిచాయి. స్కూల్ ఫైనల్ పాస్ అయినంత వరకు వేరే ఊరు చూడలేదు. కాదంటే ఆరేడేండ్ల వయస్సులో పులివెందుల తాలుకా సింహాద్రిపురంలో ఓ రెండేళ్ళు గడిపాము. ఆ విషయం తరువాత వివరిస్తా.

మా ఊరంటే ఇప్పటికీ నాకేంతో ఇష్టం. ఎవరి ఊరు వారికిష్టం. కాదనను కానీ ఈ ఊరు ప్రత్యేకం. ఆ తరువాత చాలా ఊర్లలో వున్నా కానీ దీని ప్రత్యేకత వేరు.

ఈ ఊర్లో వుండేది రెండు వీధులే. ప్లస్ ఆకారంలో వుంటాయి. గ్రాఫ్ పేపర్‌లో $xx^1$, $yy^1$ ల్లాగా వుంటాయి. తూర్పు, ఉత్తరాల మధ్య భాగం అంతా 30 నాయీ బ్రాహ్మలు ఇళ్ళు, 4 బ్రాహ్మణుల ఇళ్ళు వుంటాయ్. తూర్పు, దక్షిణాన మధ్య సాయిబులు ఓ 30 ఇళ్ళు, ఓ రెండు తంబళ్ళు వాళ్ళ ఇళ్ళు వుంటాయ్. పడమర, ఉత్తరాల మధ్య రెడ్ల ఇండ్లు ఓ 10, గొల్లవాళ్ళ ఇండ్లు ఓ 2, ఒకటి రెండు నాయీ బ్రాహ్మణుల ఇళ్ళు, మా ఇల్లు వుంటుంది. మిగతా భాగంలో ఓ నాలుగు వైశ్యుల ఇళ్ళు, ఓ రెండు బలిజ వాళ్ళు, ఓ రెండు బోయ వాళ్ళ ఇళ్ళు వుంటాయి.

ఊర్లో కోదండ రామాలయం, సత్రం రెండూ కలిసి వుంటాయ్. అవి మా ఇంటి ఆవరణలోనే వుంటాయ్. ఊరంతటికీ మంచి నీళ్ళ బావి వుంటుంది.

సూర్యోదయం తరువాత మా ఊరు చాలా సందడిగా వుంటుంది. ఉదయం చుక్క పొడవంగానే, అదే ఉదయం నాలుగు గంటల సమయానికల్లా నాయీ బ్రాహ్మణులు వాయిద్య సాధన చేయటం ప్రారంభిస్తారు. నాదస్వరం, క్లారినట్, డోలు మొదలగు అనేక రకాల వాయిద్యాలు సాధన చేస్తారు. అన్నమయ్య శ్యామశాస్త్రి లాంటి ఉద్దండులైన వాగ్గేయకారులందరూ అక్కడ కొలువు తీరి వుంటారు. నిజానికి మా ఊరు ఓ గొప్ప సంగీత కళాశాల వెలసివుండవలసిన ఊరు. ఉద్దండులైన విద్యాంసులు ఇక్కడ జన్మించారు.

## ముసలమ్మ పండుగ

ఈమె ఎవరో తెలియదు గానీ ప్రతి ఏడు పండగ చేస్తారు. ఊరికి ఏదో అరిష్టం జరుగుతుందని దేవత ముసలమ్మ రూపంలో ఇంటి తలుపు తట్టి ఆ ఇంటివారికి చేటు చేస్తుందని ఎక్కడ నుండి ప్రచార మౌతుందో చెప్పలేరు కానీ ప్రజలంతా భయభ్రాంతులయ్యేవారు. ఆమె దృష్టి మరల్చడానికి ప్రతి ఇంటి గోడల పైన ఎఱ్ఱ మట్టితో " ఓ స్త్రీ ... రేపు రా " అని రాస్తారు. ఆమె అది చదువుకుని ప్రతి రోజు ' రేపు .... రేపు' అని వెనుతిరిగిపోతూ వుంటుందంట.

ఊరిలో ముఖ్యంగా 'కలరా' లాంటి వ్యాధి వచ్చినపుడు, అమ్మవారు, పొంగు వ్యాధి, ఇలాంటి భయంకరమైన వ్యాధులకు భయపడి ఈ ముసలమ్మ పండుగ చేసి ఆమెను పూజించి శాంతింపచేస్తారు.

## 9. నందులవారి వంశవృక్షం

భాకరా వారి తరువాత మా ఊర్లో స్థిరపడ్డ వారు నందులవారు. అంటే మేమే. మా పూర్వీకులు ఈ ఊరు ఎలా వచ్చారనేది మా వంశవృక్షం చూడాలి. మొదటగా మా ఇంటిని గురించి చెప్తాను. ఊరిలో దగ్గర దగ్గర నాలుగొ వంతు వుండేది మా యిల్లు, లంకంత ఇల్లు ఇరవై అంకణాల ఇల్లు, తూర్పు పడమరలుగా వుంటుంది. దక్షిణం వైపు పెద్ద పశువుల కొట్టం. ఇంట్లో కిటికి లోంచి చూస్తే పశువులు కనపడాల్సిందే. ఇంటికి తూర్పు వైపున పెద్ద ఖాళీ స్థలం. పడమటి వైపు పెద్ద కళ్ళం, అది కాక పెద్ద స్థలం, ఇంటి ముందు పెద్ద పెద్ద అరుగులు. ఈ అరుగుబండలు అర అడుగు మందం వుండేటివి. ప్రహారీ గోడ వుండేది. ప్రహారి దాటి బయటికి వస్తే వీధి బయట అరుగు వుండేది.

కోదండ రామాలయం, సత్రం ఈ రెండు మా ఇంటి ఆవరణలోనే వుంటాయ్. కాదంటే వాటి వాకిళ్ళు వీధి వైపుకు వుంటాయ్.

మాది వెలనాటి శాఖ. రాయలసీమలో వెలనాటి శాఖీయులు చాలా తక్కువ. గౌతమస గోత్రం, ఆపస్తంభ సూత్రం, యజుశ్శాఖాధ్యాయులు, ఈ వంశ వృక్షంలో తెలిసినంతవరకు ఆది పురుషుడు బ్రహ్మశ్రీ నందులకొండు భట్టు గారు. వారు అప్పటి గుంటూరు జిల్లా, ఇప్పటి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు దగ్గరి వల్లూరు గ్రామ నివాసులు.

# స్త్రీ వాది

పెద్దనాయన తెచ్చిన ఎద్దుల్లో ఇది ప్రత్యేకం. వచ్చిన రోజు నుండి మేత తినలేదు. నీళ్ళు తాగలేదు. మామూలుగా ఏ ఎద్దులైనా ఒకటి రెండు రోజులు ఇలా బెంగ పెట్టుకుంటాయ్. ఎందుకంటే వీటిని నేరుగా ఆవుల దొడ్డి నుండి తెస్తే వాటి మంద నుండి వేరైనందుకు, స్థలమార్పిడి జరిగినందుకు, మనుష్యులు అలవాటు లేనందుకు వొకటి రెండు రోజులు బెంగబెట్టుకుని తరువాత మెల్లగా అలవాటు పడిపోతాయ్.

ఈ ఎద్దు మాత్రం వారం రోజులైనా దారికి రాలేదు. మా నాయన ఎన్నిరకాల ప్రయోగించినా ప్రయోజనం లేకపోయింది. పెద్దనాయన బెంగపెట్టుకున్నాడు. ఎద్దు పాల బిర్రు తగ్గిపోతూ వుందని. ఒక రోజు అమ్మ పాలు పిండడానికి బఱ్ఱెను గుంజకు కట్టెసి వీపు నిమిరి పాలు పితుకుతూ వుంది. అమ్మ వైపు ఈ ఎద్దు చూస్తూ చెవులు అల్లాడిస్తూ, మోర ఊపుతూ వుంది. ఇది గమనించిన అమ్మ పాలు పిండడం అయిన తరువాత దాని దగ్గరకు వెళ్ళి వీపు చరిచింది. అమ్మకు అప్పుడప్పుడు ఎద్దులకు మేత వెయ్యటం, నీళ్ళు పెట్టడం అలవాటే. అమ్మ వీపు చరచగానే అది మహదానందపడి అమ్మను నాకటం ప్రారంభించింది. ఇది గమనించిన మా నాయన తొట్టితో నీళ్ళు తెచ్చి పెట్టాడు. అమ్మ తొట్టిలో నీళ్ళు కలుపుతూ వుంటే కడుపార తాగింది.

అపుడు గుర్తొచ్చింది పెద్దనాన్నకు . ఈ ఎద్దును కొన్న ఆవుల దొడ్డిని సంరక్షించేది ఒక స్త్రీ అని. సాధారణంగా వేరే వారిని చూసే అవకాశం వీటికి వుండదు. అందుకే పుట్టినప్పటి నుండి స్త్రీ వాదిగానే వుండిపోయింది. ఆ తరువాత కొంతకాలానికి దీన్ని అమ్మటం జరిగింది. యధావిధిగా బెండుమేతల, తప్పెట తాళాలతో సాగనంపారు. వెంట అందరూ వున్నంతవరకు బాగానే వుండింది.

ఊరి పొలిమేరలు దాటిన తరువాత దానికి అర్థమైనట్టుంది తనను ఎక్కడికో తీసుక వెళ్ళుతున్నారని. అంతే తిరగబడింది అగ్రహోదగ్రుడై లేచింది. కొన్న ఆసామి ముల్లు కర్రతో ఒకటి ఇచ్చినట్టున్నాడు. బడికి వెళ్ళె పిల్లవాడు మెండికేసి తిరగబడ్డట్టు తిరగబడి తాళ్ళు తెంచుకుని ఇంటి వైపు పరుగు తీసింది. తోక పైకి లేపి, చెవులు రిక్కరించి, మోర పైకిత్తి పరుగు తీస్తుంటే ... అపర నందీశ్వరుని లాగా కనిపించింది. ఒక్క ఉదుటున ఇంటి తలవాకిట్లొ వాలిపోయింది.

## పని దొంగ

" కాడికి పోరా తిమ్మా అంటే కడుపునొస్తదమ్మా అన్నాడట, కంచం తెచ్చుకోరా తిమ్మా అంటే .. అట్ట పెప్పు నాయమ్మ " అన్నడంట. ఈ సామెత మా పెద్ద మేనత్త చెప్పేది. ఇదో ఈ కోవకు చెందిందే ఒక ఎద్దు మా ఇంట్లో వుండేది. వొట్టి గడ్డి పచ్చి గడ్డి , ఏది పెడితే అది శుభ్రంగా తినేది. కాడి కట్టుకుని పొలం దున్నటానికి వెళితే ఒక నాలుగు 'కొంద్రలు' (మలుపులు) దున్ని ప్రతి మలుపు దగ్గరా పండుకునేది. ఏంచేసినా లేచేది కాదు. కొట్టేవారు, ముల్లు బర్రతొ పొడిచేవారు. రక్తం కారేది. నాయనకు, పెద్దనాయనకు ఇది ఇష్టం వుండేది కాదు. సేద్యగాడు మాత్రం నిర్దాక్షిణ్యంగా తోక కొరికేవాడు. కంట్లో కారం పోసేవాడు. అయినా లేచేది కాదు. మహా మొండిఘటం.

పట్టెడ విప్పితే గాని పైకి లేవదు. మలుపు మలుపుకు పట్టెడ విప్పుతూ పోవాల్సి వచ్చేది. పని చేసే వారికి విసుగు పుట్టేది. బండికి కట్టినా అంతే .. 'కపిల' కు కట్టినా అంతే .. కపిలకు కట్టినప్పుడు బొక్కెన లాగేటప్పుడు పండుకోదు. 'బారి'లో నుండి తిరిగి పైకి వచ్చేటప్పుడు పండుకుంటుంది. ఇది పని దొంగ. దానికి తెలివి ఎక్కువ అని అందరికి తెలిసిపోయింది. మొండికేసే ఎద్దుతో వ్యవసాయం. బండ కేసే భార్యతో సంసారం కష్టమని తేల్చి చాలా తక్కువ రేటుకు దాన్ని అమ్మేశాడు పెద్దనాయన.

## అద్రుపుండు ఎద్దు

బహుశా నందుల వారింటో నందీశ్వరులు కనుమరుగు కావటానికి ముందు వున్న ఎద్దు ఇది. కష్టించి పనిచేసే తత్వం. దీనికి జత ఎద్దును కొనలేని దుస్థితి. వొంటరి పోరాటమే చేశాడు పెద్దనాన్న. పని ప్రారంభించిన రెండు మూడు రొజులకే అట్లుపగిలి పుండై చీముకారడం ప్రారంభిస్తుందీ ఎద్దుకు. అది మానటానికి మళ్ళీ నెలరోజులు పడుతుంది. ఈ లోపుల కాకులు పొడిచి అది మరింత పెరగిపోకుండా కావలి కాయాలి. 'ఎద్దు పుండు కాకికి రుచి'.

ఒకసారి ఇంటి ముందు 'మొరస' తోలాలని మా పెద్దనాయన ఈ ఎద్దుతో కోటేరు బండి కట్టారు. కోటేరు బండి అంటే ఒక వైపు ఎద్దును కట్టి, రెండవ వైపు కాడి మానుకు పంగల కట్టెను కట్టి ఆ పంగల కట్టెకు చివరి భాగంను బండి వొగలకు కట్టి ఈ భాగం వెనుకకు రాకుండా చూస్తారు. ఎద్దు కదిలితే బండి అంతా కదులుతుంది.

# చివరి ఎద్దుల జత

ఆశతీరని, ఆశయం నెరవేరని, ఆరాటం ఆగని , ఆర్భాటం వదలని మనిషి చివరి వరకు పోరాటం చేస్తూనే వుంటాడు. కాలం కాటు వేసినపుడు వెనకడుగు వేసి, కాలం కలిసొచ్చే వరకూ కనిపెట్టుకుని వుండడు మనిషి. ఏదో సాధించాలని తనను తాను నిరూపించుకోవాలని ఆరాటపడతాడు. అదో ... అదే ఆరాటంతో ... చివరిగా అక్కడ, ఇక్కడ .. అన్ని చోట్ల ప్రోగుచేసుకున్న డబ్బుతో చివరి ఎద్దుల జతను ఒంగోలు నుండి తెచ్చాడు. అప్పటికి ఒంగోలులో ఇంకా మాకు భూములు వుండేవి. పన్నులు కూడా కడ్తూ వుండేవారు.

ఒంగోలు ఎద్దులను కొనుగోలు చెయ్యటానికి వెళ్ళినప్పుడంతా వల్లూరి కరణం గారికి పన్నులు కట్టి వస్తూ వుండేవారు. ఏండ్ల తరబడి కట్టినా రశీదులు తీసుకోలేదు.

చివరి ఎద్దుల జతను కొని తెచ్చారు. ఇంటికి వచ్చిన తరువాత వాటికి కావాల్సిన ఆహారం సమకూర్చటం కష్టమైంది. ఏదో మామూలు ఎండుగడ్డి, చొప్ప, శనగకట్టె తినమంటే అవి తినవు. అందులో ఒక ఎద్దు మరీ మొండిది. కొపమెక్కువ. పొడచడం కూడా అలవాటుంది దానికి. సేద్యం నేర్పడమే కష్టమైంది. అందుకై దాన్ని అమ్మేయాలని చూశారు. పొడిచే అలవాటు వుండే ఎద్దులను కొనే వాళ్ళు చాలా అరుదు. అందుకై తక్కువ ధరకే అమ్మేశారు.

ఇక రెండవ ఎద్దుకు అనుకోకుండా ‘గాలికుంటు వ్యాధి’ సోకింది. ఈ వ్యాధి సోకితే తేరుకోవటానికి చాలా కష్టం. వళ్ళంతా నల్లగా అయిపోయి చలికి వణికి పోతూ వుంటుంది ఇంట్లో వట్టి గడ్డి కూడా అయిపోవచ్చింది. చివరకు మేత కూడా లేదు. ఇంట్లో వుండే ‘రావి’ చెట్టు కొమ్మలు కొట్టి రావి ఆకు వేస్తే తినేది పాపం. దీని బాధ చూడలేక ఎంతకైనా అమ్మితే ఎవరింట్లో నైనా తిండి తిని పని చేసుకుంటూ వుంటుందని అయిన కాడికి అమ్మేశారు.

పొడిచే ఎద్దును కొన్న అతను మాత్రం దాని ఆవేశాన్ని, కోపాన్ని , కసిని, బాగానే వాడుకున్నాడట. తగినంత ఆహారం మాత్రం పెట్టి ఎప్పుడూ ఆకలి రగిలించే వాడట. ఎక్కువగా కొండ కట్టెలు తోలటానికి బండికి కట్టేవాడట. బాగా కొట్టేవాడట. ఎంత బరువు నైనా బుసలు కొడుతూ నాగు పాములాగా సరసర లాగుతూ వుండేదట.

ఇంటికి చేరుకున్నాక గాటికి కట్టేయాలంటే ఇటు వైపు, అటు వైపు ఇనుప

# (11) పాడి వైభవం

నందుల వారింట నందీశ్వరుల వైభవం అలా ముగిసింది. నందీశ్వరుల తర్వాత చెప్పుకోవాల్సింది మా ఇంట పుట్టిన బఱ్ఱెలు. మా యింట ఎప్పుడూ కనీసం రెండు బఱ్ఱెల పాడి వుండేది. పుష్కలంగా పాలు, పెరుగు దొరికేది. ఎప్పుడు కావలంటే అప్పుడు అమ్మ వెళ్ళి బఱ్ఱె వీపు తట్టి పొదుగు కడిగి పాలు పిండేది.

ఎద్దుల వైభవం నడిచినన్ని రోజులు బఱ్ఱెలకు కూడా వైభవం భాగానే నడిచింది. మంచి గడ్డి, కడుగునీళ్ళు, కుడితి అన్నీ బాగానే వుండేటివి. తిండి పుష్కలంగా వుంటే పాలు పుష్కలంగానే ఇచ్చేవి. బఱ్ఱెలు సూటివైనా, పాలిచ్చేవైనా, ఎండిపోయిన ఒకే రకంగా పోషణ జరిగేది. బఱ్ఱె ఈనిందంటే దానికి మనుష్యులకు చేసినట్లు బాలింతతనం చేసే వాళ్ళు. ఈనిన వెంటనే అయితే దూడను పూర్తిగా నాకేస్తుంది.

దూడకున్న తడిని, ఒక రకమైన బంక బంకగా వుండే దూడను శుభ్రంగా నాకుతుంది. దూడకాళ్ళు గిట్టల మొనలు మెత్తగా సున్నితంగా వుంటాయ్. అవి గిల్లి తల్లికి పెడతారు. పుట్టిన గంటలోపే లేచి నిలబడుతుంది. రెండు జతల కాళ్ళ మధ్యలో చిన్న కఱ్రతో నెమ్మదిగా తట్టడుస్తారు. దీన్ని "కొంకులు కొట్టటం" అంటారు. కాలికీళ్ళను సరిచేయుటమన్నమాట.

ఆ తరువాత వండిన ఆముదంలో చూపుడు వేలు ముంచి దూడ నోట్లో పెట్టి దాని దవడలను వెనుకకు ముందుకు కదిలిస్తారు అంటే చీకటం నేర్పుతారు. ఆ తరువాత తల్లి పొదుగు దగ్గరకు తీసుకొని వెళ్ళి పాలు తాగిస్తారు. దూడ పుట్టినవెంటనే తల్లి దాన్ని శుభ్రంగా నాకకున్నా, కాలి గిట్టల మొనలు తినిపించకున్నా తల్లికి, పిల్లకు అనుబంధమేర్పడేది కాదు. అప్పుడు పాలు 'చేపుకు' రావు అందుకే ఈ తతంగమంతా.

మా ఇంట్లో పుట్టిన బఱ్ఱెదూడలన్నీ ఆడవే అంటే పెయ్య దూడలు (పై దూడలు) మా నాయన చాలా గర్వంగా చెప్పేవాడు, మా ఇంట్లో మనుషలను పుడితే మగపిల్లలు, బఱ్ఱెలకు పుడితే అడదూడలు అని, మనుషుల్లో మగపిల్లలు లాభాదాయకం, పశువుల్లో ముఖ్యంగా బఱ్ఱెల్లో ఆడసంతానం లాభదాయకమని వ్యవసాయ కుటుంబాలు భావిస్తారు. మా ఇంట్లో పుట్టిన దూడలు అన్నీ ఆరోగ్యంగా పెరిగాయ్.

నాకు తెలిసినంతవరకు ఒకే ఒక దూడ చనిపోయింది. పుట్టిన నాలుగు రోజుల తరువాత అకస్మాత్తుగా చనిపోయింది. మామూలుగా అయితే పల్లెటూర్లలో దూడలు

# 15. ఆటలు

పల్లెటూర్లలో అణా పైసా ఖర్చులేకుండా రకరకాలైన ఆటలు ఆడేవారు. అందులో శారీరక శ్రమ, ఆటలోని చాతుర్యాలు ఇమిడి వుండేవి. పెద్దల ఆటలు, మగపిల్లల ఆటలు, ఆడపిల్లల ఆటలు వేరువేరుగా వుండేవి. మగపిల్లలు అప్పుడప్పుడు పెద్దలు చూడకుండా పెద్దల ఆటలు ఆడేవాళ్ళు. ఆడపిల్లలు మాత్రం మగపిల్లలు తమ ఆటల్లోకి రానిచ్చేవాళ్ళు కారు. కానీ ఒకటి రెండు ఆటలు, ఆడపిల్లలు మగపిల్లలను కలసి ఆడేవారు.

పులిజీతం, నక్కాముట్టి, మున్నూట నాలుగు, జిగ్గ బగ్గ జోకరు లాంటివి మగవాళ్ళు పెద్దలు ఆడేవాళ్ళు. బారాకట్ట, పిచ్చలాట, ఆడవాళ్ళు, పెద్దలు అడేవాళ్ళు. పుట్టచెండు, బొంగరాలు, గొలిగుండ్లు, డోలుపట్టె, బలిగుడు లాంటివి మగపిల్లలు ఆడే వాళ్ళు, అచ్చెనకాయులు, తొక్కుడుబిళ్ళ, ముగ్గులు ఆడపిల్లలు ఆడేవాళ్ళు. దాగుడుమూతులు, చింతబజ్జ, లాంటివి ఆడపిల్లలు మగపిల్లలు కలసి ఆడేవాళ్ళు.

'పులిజీతం' పెద్దలు ఎక్కువగా ఆడతారు. నాలుగు పులులను పదహార మేకలు కట్టివేయాలి. అంటే ... నాలుగు గులకరాళ్ళు పులులుగా, పదహారు చినచిన్న రాళ్ళు మేకలుగా వాడతారు. సమబాహు త్రిభుజకారంలో శీర్షం నుండి భూమికి లంబాన్ని గీచి, శీర్షం వైపు, భూమి వైపు కొంత స్థలం వదలి మధ్యలో రెండు దీర్ఘచతురస్రాలు ఒకదానికి ఒకటి తగలకుండా గీస్తారు. నాలుగు పులులను శీర్షం పై ఒకటి, దీర్ఘచతురస్రాలు, లంభం ఖండించుకునే బిందువుల వద్ద మిగిలిన మూడు పెడతారు. భూమిపై నున్న మూలలో తప్ప అన్ని మూలల్లొ మేకలు పెడతారు. పులి మేకను దాటి తరువాత ఖాళీ స్థలం లోకి వెళితే మేకను తిన్నట్లు .. కానీ పులిని మేకలు తినలేవు.

కాబట్టి కదలకుండా బంధించాలి. చెస్‌లో చెక్ పెట్టినట్టు ఈ ఆట గంటల తరబడి పడ్తుంది. ఎత్తుకు పై ఎత్తు వేస్తూ ఆటగాళ్ళు నిమగ్నమై పోతారు. సత్రం బండమీద , రాగిచెట్టు అరుగుమీద పులుల స్థానంలో పెద్ద .. గుంతలు పడి వుంటాయ్.

జిగ్గ, బగ్గ, జోకరు, మున్నూట నాలుగు (త్రీనాట్‌ఫోర్) ఇవి పేకాటలు. పెద్దలు అప్పుడప్పుడు డబ్బులు పెట్టి ఆడతారు. ఇందులో మా నాయన కూడా వుంటాడు. పిల్లల కంటపడితే పాడై పోతారని మా ఇంటి ఎద్దు కొట్టంలో అరుగుపై ఆడేవాళ్ళు,

# 20. నాటకాలు

సినిమాలు, టి.వి.లు, ఇంటర్‌నెట్‌లు దేశంపై దాడిచేయని రోజుల్లో వీధి నాటకాలు, తోలు బొమ్మలాటలు, హరికథలు, ఊరి ప్రజలకు ఊరట కలిగించేవి. అప్పుడప్పుడు సర్కస్‌లు, దొమ్మరి ఆటలు, గంగిరెద్దు ఆటలు, వొగ్గు కథలు, హరికథలు, బుర్రకథలు ... ఇలా రకారకాలైన వాటితో ఆనందం పొందేవారు. ఆ తరువాత ' సురభి' నాటకాలను, ఈల పాట రఘరామయ్య, బుర్రాసుబ్రమణ్యశాస్త్రి, ఆచంట వెంకటరత్నం నాయుడు లాంటి మహోన్నత నటుల నాటకాలను చూడటం కోసం మైళ్ళు, మైళ్ళు నడిచిపోయి చూసి ఆనందించేవారు. బళ్ళారి రాఘవ లాంటి మహోన్నత నటులను వారి నాటకాలు పల్లె ప్రజలకు అందేటివి కాదు.

నాటకం చూస్తున్నంత సేపు తమ కిష్టమైన పాత్రల్లో తమను ఆవహింప జేసుకొని ఆనందించేవారు. అయితే ఆ పాత్రే తాము కావాలన్న ఆశ అందరికి వుంటుంది. అందుకే భాకరాపేటలో మొట్టమొదటిసారిగా శ్రీ కోదండ రామా నాట్యమండలి వెలిసింది. 'శ్రీకృష్ణరాయబారం' నాటకం వేయాలని నిశ్చయించుకున్నారు. రాయాభారం నాటకం పుస్తకం తెచ్చుకున్నారు. లొడుగు పెద్ద కేశన్న గొప్ప సంగీత విద్యాంసుడు కాబట్టి ఆయనే నాటకం నేర్పించను పూనుకున్నాడు.

నందుల రామమూర్తి పి.యు.సి. పరీక్షలు రాసి ఇంటిలో వుండడం వల్ల ఊర్లో వున్న జనాన్నంతా సమీకరించి రాయబారంలో అన్ని పాత్రలకు నటులను ఎన్నుకోవటం జరిగింది. వీళ్ళలో చాల మందికి చదవను, రాయను రాదు. అందుకే పలుగురాళ్ళపల్లె హైస్కూల్‌లో చదువుతున్న బడిపిల్లలందరిచే తలొక్కొక పాత్రకు వారి 'పోర్షన్ 'రాసి ఇచ్చి పదిరోజులపాటు వాళ్ళతో పలికిచ్చే బాధ్యత వొప్పగించారు.

సంస్కృత పదాలు వచ్చిన చోట, కఠినమైన తెలుగు పదాలు వచ్చిన చోట పలకటం చాలా మందికి కష్టంగా వుండేది. పిల్లలు స్కూలుకు పోయి వస్తారు. పాత్రధారులు పనులకు పోయి వస్తారు. సత్రంలో, దేవళంలో, కళ్ళాల్లో, రావిచెట్టు అరుగు మీద .... ఎక్కడ పడితే అక్కడ అకుంఠిత దీక్షతో పలికేవాళ్ళు, పలికించే వాళ్ళు కనబడటం మొదలు పెట్టారు. పాత్రధారులకు ఎంత వరకు వచ్చిందో తెలియదు గానీ, పిల్లలందరికి పద్యాలు మొత్తం నోటికి వచ్చేశాయ్.

# ప్రేమ వివాహం

మనసుకు నచ్చిన వారితో జీవితం పంచుకోవటానికి పడే ఆరాటం మనిషి మనుగడ మొదలైనప్పటి నుంచి వుంది. తనకిష్టం లేని వాడిని పెళ్ళి చేసుకోకుండా ఇష్టమైన వాడిని వెదుక్కుంటూ ధైర్యసాహసాలు ప్రదర్శించి చివరికి మెచ్చిన వాడితోనే మెడలో తాళి కట్టించుకుని జీవిత సాఫల్యం పొందడమనేది అనాదిగా వస్తున్న చరిత్ర. ఇలాంటిదే భాకరాపేటలో కూడా జరిగింది.

చిన్నగోపవరం నాగిరెడ్డి ఆజానుబాహుడు, నెమ్మదస్తుడు. ఎద్దుల వ్యాపారంలో అందెవేసినచేయి. ఈయనకు మగసంతానం లేదు. ఇద్దరు ఆడపిల్లలు. పెద్దక్క, నాగమ్మ. ఇద్దరూ ఆరడుగుల స్త్రీమూర్తులే. ఎర్రటిఛాయతో... నుదుట పెద్ద కుంకుమ బొట్టుతో చూడచక్కగా వుంటారు. ఊర్లో ఎక్కువ మంది 'నాగిరెడ్డి మామా' అని పిలిచేవారు. కులమతాల సంబంధం లేకుండా.. బహుశా అందమైన ఆడపిల్లలున్న తండ్రులను చాలా మంది 'మామా' అనే సంబోధిస్తారనుకుంటా.

నాగిరెడ్డిమామ తన మేనల్లుడు ' ఎంకటయ్య ' ను చిన్నప్పటినుంచే పెంచుకున్నాడు. ఆయనకు పెండ్లి చేసి తన పిల్లలతో ఆయన పిల్లలను కూడా సంరక్షించేవాడు.' ఎంకటయ్య ' (ఎంకరెడ్డి) కూడా స్వంత ఇల్లులాగా పని చేసేవాడు. పెద్దక్కకు పెళ్ళి చేసి పెద్దల్లుడిని కూడా ' ఇల్లరికం ' తెచ్చుకున్నాడు.

మిగిలింది 'నాగమ్మ'. చిన్నకూతురు. ఈమెకు పెండ్లి చెయ్యాల్సి వుంది. ఏదైనా మంచి సంబంధం బయటిది చూసి చెయ్యాలని నిశ్చయించుకుని మైసూరులో కాంట్రాక్టు చేసి బాగా సంపాదిస్తూ వున్న పిల్లవాడితో సంబంధం కుదుర్చాడు నాగిరెడ్డి మామ. కట్నం బాగానే ఇవ్వ నిర్ణయించుకున్నట్లుంది. పెండ్లి ముహూర్తాలు నిశ్చయించుకున్నారు.

మేనరికం రెండు వైపులనుంచి వుంటుంది. తండ్రి యొక్క అక్కచెల్లెండ్ర పిల్లలు, తల్లి యొక్క అన్నదమ్ముల పిల్లలు. ఈ రెండు వరుసల్లో తండ్రి వైపు మేనరికం ఇవ్వడానికి తల్లికి ఇష్టం వుండదు. కానీ ఆడపిల్లలు పుట్టినప్పటినుంచి మేనత్తలు తమ వంశం, తమ రక్తం... లాంటి సంబంధాలతో ... తమవైపు తిప్పుకోవాలని చూస్తారు.

పిల్ల పుట్టినప్పటి నుంచి 'అమ్మ' తనవైపువాళ్లను పరిచయం చేసి 'అమ్మ' మాట నేర్పిన తరువాత 'మామ' మాటనే నేర్పి తన అన్నదమ్ములకు , వారి పిల్లలకు దగ్గర చెయ్యాలని చూస్తారు. ఆవిధంగా మేనత్త కొడుక్కే ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది మేనమామా కొడుక్కంటే. కారణం.. మేనమామ భార్య ఈ ఇంటి సంబంధమును ఇష్టపడదు కాబట్టి.

# 25. శాస్త్రవేత్త

మా ఊర్లో కోమటి వెంకటసుబ్బయ్య అంటే ఎవరికి తెలియదు. 'శెట్టి' అంటేనే అందరికి తెలుసు. దయ్యం పట్టిన బీబీని నిశితంగా గమనించి బీబీకాదు మాట్లాడేది, 'దయ్యమే' అని నిరూపించాడు. ఈయన కూడా వైద్యుడే. మా ఊరిలో 'ఇండేషన్' అంటే ఇంజక్షను వేయగల ఏకైక వైద్యుడు. రకరకాలైన ఇంజక్షన్లతో ప్రయోగాలు చేస్తుంటాడు. ఎంతో పెద్ద జబ్బు చేస్తేగానీ 'ఇండేషన్' చేయించుకోరు. అది కూడా అతి బలవంతం మీద.

ఎవరికైనా పన్నునొప్పి వచ్చినా, పిప్పి పళ్ళు వున్నా శెట్టి వైద్యమే. రామములక్కాయలను ఎండబెట్టి, వాటి విత్తనాలు సేకరించి వాటిని వెన్నలో కలిపి నిప్పులపై వేసి ... ఆ వచ్చే పొగను గొట్టం ద్వారా ఒక చెవిలోకి పంపి, మరో చెవిలో ఊదురు గొట్టంతో గాలి ఊదుతూ వుంటాడు. అరగంట తర్వాత చూస్తే .. ఈ చెవిలోని గొట్టం ద్వారా పొగ పోయి పళ్ళలో వుండే పురుగులను చంపితే.. ఆ చనిపోయిన పురుగులు గొట్టం గుండా పెనంలో పడతాయి. వాటిని చూపించి పంటినొప్పి పోయిందంటాడు.

దీపావళికి టపాకాయలు కాల్చినా వైరుధ్యముండేది. వింత టపాకాయలు తయారు చేసేవాడు. అల్లం రసం ఎందుకు వేడిని పుట్టిస్తుందోనని పరిశోధనలు చేసేవాడు. ఊరందరితో 'చతుర్లు' ఆడేవాడు. పెండ్లిళ్ళలో 'వసంతాలు' ఆడితే... ఈయన చివరకు కడుగునీళ్లను కూడా వసంతంగా వాడేవాడు.

ఈయన భార్య మంచి ఇల్లాలు. అయితే .. ఆమెకు ఒక్కటే పిచ్చి. 'కాఫీ' పిచ్చి. రోజుకు రెండు సార్లయినా కాఫీ తాగాలి. అప్పటికి ఇప్పటికి ప్రతి ఇంటిలో భరించలేని అనవసరమైన ఖర్చు... కాఫీ ఖర్చు. శెట్టికి అసలు ఇష్టముండేందికాదు. ఈయనకు తెలియకుండా ఏదోఒకవిధంగా కాఫీ తాగేది. ఎట్లా వచ్చిందని అనుమానంతో విపరీతంగా కొట్టేవాడు. అయినా కాఫీ మానేది కాదు. అప్పుడు కాఫీ బిళ్లలు వుండేవి. కనీసం వాటి వాసనైనా చూసేది.

అమ్మ దగ్గరకి కాఫీ పొడికొరకు వచ్చేది. ఆమె కాఫీకి పాలు, చెక్కెర అవసరం లేదు. మరిగే నీళ్ళలో కాఫీపొడి వేసి తాగేది. వీలైనంత వరకు అమ్మ ఇచ్చి పంపేది. ప్రతిదినం ఏదోఒకసాకుతో కొడుతూ వుండేవాడు. రక్తం కారేది. మళ్ళీ వెంటనే మందులు, మాకులు ఇచ్చి దెబ్బలు మాన్పేవాడు. కొట్టేటప్పుడు ఎవరు చూడకుండా తలుపులు

# 27. అతిథులు

ప్రతి ఇంటికి చుట్టాలు వస్తూంటారు. కానీ ఊరు మొత్తానికి అతిథులు వేరుగా వుంటారు . తిథి,వార, నక్షత్రాలు లేకుండా వస్తువుంటారు. వీరిలో సంవత్సరానికి ఒకసారి వచ్చేవారు, వారానికి ఒకసారి వచ్చేవారు, సీజన్ ప్రకారం వచ్చేవారు వుంటారు.

ప్రతిసంవత్సరం వచ్చి ఆనందింపచేసేవాళ్ళలో "బొమ్మలాటగాళ్ళు". వారు కనీసం పది, పదిహేను మంది వుంటారు. నాలుగు ఎద్దులబండ్ల మీద వాళ్ళసంసారం, సామగ్రి అంతా వేసుకుని వచ్చి ఊరిముంగిట్లో గుడారాలు వేసుకుని వుంటారు. రెండు, మూడు బొమ్మలాటలు, రెండు, మూడు వీధినాటకాలు వేసేవరకు వదలరు. ఊరిలో అందరిని చందాలు అడిగి, భోజనాలు పెట్టించుకుని , వారి పశువులకు మేతకూడా ఇచ్చి వారం, పదిరోజులు సత్కరించేటప్పటికి ఊరికి భారమై పోతుంది. ఆ తర్వాత వేరే ఊరికి బయలుదేరుతారు.

తనకు ఎప్పుడు ఇష్టమైతే అప్పుడు బ్రాహ్మణ ఇళ్ళకు వచ్చి ఉదయం చెప్పుకొంటాడు. ఆరోజంతా ఊరిలో భజనచేస్తాడు. ఆంజనేయ భక్తుడు ఈయన. ఈయన పేరు అనంతయ్య. భక్తిపారవస్యంలో భజన చేసేటప్పుడు ఆంజనేయుడిలాగా మూతి బిగించి, తన్మయంలో మునిగి పాటలు పాడతారు. ఊరి జనం అంతా ఈయనచుట్టూ మూగి ఆనందిస్తారు. ఊరిలో ఎవరైన ప్రశ్న అడిగితే చెపుతాడు. భవిష్యత్తు గురించి, జరుగబోయే మంచి, చెడుల గురించి చెబుతాడు. మితభాషి. ఎవరితోను ఎక్కువగా కలిసిపోడు. ఆయనేంటో, ఆయన పనేంటో.

మరో అతిథి.. తిక్కనరసింహులు. ఈయన స్వస్థలం కోడూరు.ఎవరికైనా, ఏదైనా అవసరం పడితే బ్రాహ్మణ ఇళ్ళలో సహాయం చేస్తాడు. మరీముఖ్యంగా అపరకర్మలకు ముందుంటాడు. ఈయన ప్రత్యేకత ఏమిటంటే ... ఈయన చేతికి ఎప్పుడు 'గడియారం' వుంటుంది. అది ఎప్పుడు పని చేయదు.గడియారంలో ముళ్ళు వుండవు. కేవలం డబ్బా మాత్రం వుంటుంది. ఈయనను చూచిన ప్రతిఒక్కరు ఈయనను 'టైం' అడుగుతారు. ఈయనకూడా ఎంతమంది అడిగిన విసుక్కోకుండా చాలా ప్రత్యేకంగా ఫీలై చెప్తాడు. అయితే ముందు ఆకాశంలో సూర్యుడి వైపు ఒక కంటితో చూసి తరువాత గడియారం వైపు చూసి 'టైం' చెప్తాడు. అడిగినవారు నవ్వుకుని సంతోషిస్తారు. చెప్పినవారు తన గడియారాన్ని ప్రజలు గుర్తించినందుకు ఆనందిస్తాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Maa+Oori+Nandula+Atmiya+Katha**

* * *